పట్టిసీమ నుంచి 6,372 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,372 క్యూసెక్కుల జలాలు పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు గురువారం తెలిపారు. 18 మోటార్లు 18 పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

పుష్కలంగా నీరిస్తాం



• పక్కా ప్రణాళిక : కలెక్టర్ వెట్రిసెల్వి

రబీకి సాగు, వేసవిలో తాగునీటికి ఇబ్బందికి లేకుండా ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ముందస్తు ప్రణాళికతో అధికారులు చర్యలు తీసుకోవాలి. ఒక్క ఎకరాకు కూడా నీరు అందించలేని పరిస్థితి రాకూడదు. తాగునీటి అవసరాల దృష్ట్యా సరైన వ్యూహంతో చర్యలు తీసుకోవాలి. మేజర్, మైనర్ నీటి వనరులకు మరమ్మతులు చేపట్టే విషయం లోను జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఏప్రిల్ 15న కాల్వల మూసివేత.. జూన్ 1 నుంచి నీటి విడుదల
- నీటి కొరత లేకుండా ముందస్తు కార్యాచరణ
- మేజర్, మైనర్ నీటి వనరులకు మరమ్మతులు : కలెక్టర్ వెట్రిసెల్వి
- సాగునీటి సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వచ్చే రబీలో సాగునీటికి అనుగుణంగా తగినంత నిల్వ లేకపోయినా సాగు అవసరాల దృష్ట్యా పుష్కలంగా నీరు అందించాలని, వేలాది ఎకరాల్లో పంటకు ఆయా గ్రామాల్లో తాగునీటికి కొరత లేకుండా చూడాలని, ప్రత్యేక కార్యాచరణకు ముందడుగు వేయాలని సాగునీటి సలహా మండలిలో అధికారులు నిర్ణయించారు. కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం జరిగింది. రబీ సీజన్‌లో పశ్చిమ డెల్టా ఆయకట్టు పరిధిలో 82,251 ఎకరాలకు సాగునీరు అందించేందుకు తాజాగా ఉన్న నీటి వనరుల స్థితిగతులపై చర్చించారు. గోదావరి పశ్చిమ డెల్టా ఆయకట్టుకు, జిల్లాలో తాగునీటి అవసరాలకు 91.35 టీఎంసీల నీరు అవసరమవుతుందని అభిప్రాయ పడ్డారు. వచ్చే వేసవిలోపు ఒకవైపు రబీకి, ఇంకోవైపు తాగునీటి అవసరాలకు కేవలం 68.40 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉంటుందని అంచనా వేశారు. ఇంకా 22.95 టీఎంసీల నీరు అవసరమని గుర్తించారు. మిగిలిన నీటిని సీలేరు, ఇతర నీటి వనరుల ద్వారా పొందేందుకు అవసరమైన మేర నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని నిర్ణయించారు. వాస్తవానికి ప్రతీ వేసవికి సీలేరు నుంచి 15 నుంచి 25 టీఎంసీల నీటిని అదనంగా రప్పించి నియోగిస్తున్నారు. రబీలో సాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకో వాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఏప్రిల్ 15న కాల్వల మూసివేత

ఎప్పటి మాదిరిగానే ఏప్రిల్ 15న కాల్వలను మూసివేయాలని సమావేశం నిర్ణయించింది. తిరిగి జూన్ 1న తెరిచి నీటిని విడుదల చేయాలని తీర్మానించారు. గోదావరి నీటి లభ్యతను అనుసరించి పోలవరం, గూటాల, ఎర్రకాల్వ ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటిని అందుబాటులోకి తేవాలని నిర్ణయం తీసుకున్నారు. రానున్న శివరాత్రి సందర్భంగా పుణ్యక్షేత్రం బలివేకు తమ్మిలేరు రిజర్వాయరు నుంచి ఐదు రోజులపాటు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. మైనర్, మేజర్ నీటి వనరులన్నింటికీ తక్షణ మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. జల వనరుల ఎస్ఈ దేవప్రకాశ్, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ త్రినాథబాబు, మత్స్యశాఖ జేడీ నాగ లింగాచార్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

• ఫోన్ మాట్లాడడంలో పోటీ !



'సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం.. ప్రాణాంతకం' అని పోలీసులు హెచ్చరిస్తున్నా కొందరికి పట్టడం లేదు. బైక్ నడుపుతూ ఫోన్ మాట్లాడడం నిత్యకృత్యంగా మారింది. ఈ చిత్రం చూడండి.. భీమవరంలో బైక్ నడిపే వ్యక్తే కాదు.. వెనక కూర్చున్న వ్యక్తి పోటీ పడి మరీ ఫోన్లు మాట్లాడుతున్నారు. 6



విచారణ చేస్తున్న డీఎల్‌పీవో

బొర్రంపాలెం పంచాయతీలో..

అక్రమాలు జరిగాయా..

టి.నరసాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):బొర్రంపాలెం పంచాయతీలో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఫిర్యాదుపై జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో రజావుల్లా గురువారం విచారణ చేపట్టారు. సర్పంచ్, కార్యదర్శి లక్షలాది రూపాయలు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని, దీనిపై విచారణ జరపాలని గ్రామానికి చెందిన సామాజికవేత్త గుండె పాండురంగ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డీపీవో ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో సచివాలయంలో ఫిర్యాదుదారుడు, సర్పంచ్, పూర్వ కార్యదర్శులను విచారించారు. పంచాయతీలో జరిగిన పనులు, చెల్లింపులపై పూర్తి విచారణ చేపట్టేందుకు విచారణ కమిటీని నియమించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. అవినీతి జరిగినట్టు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. కాగా ఆక్రమణకు గురైన వాటర్ ట్యాంక్ స్థలాన్ని సర్వే చేయించి స్వాధీన పరుచుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.



ఏలూరులోని బీసీ బాలికల వసతిగృహం -1లో విద్యార్థినులకు ఫేస్ రికగ్నిజేషన్ అటెండెన్స్

బోగస్‌కు చెక్..

- హాస్టల్ విద్యార్థులకు..ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్
- జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద రెండు హాస్టళ్లు ఎంపిక

ఏలూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఫేస్ రికగ్నేషన్ (ఎఫ్ఆర్ఎస్) పద్ధతిని అమలులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలి దశలో ప్రయోగాత్మకంగా జిల్లాలోని రెండు హాస్టళ్లను ఎంపిక చేసింది. ఏలూరులోని బీసీ బాలికల వసతిగృహం -1, బుట్టాయిగూడెంలోని బాలుర వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులు ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. గురువారం ఉదయం ఈ రెండు హాస్టళ్లలో ఫేస్ రికగ్నిజేషన్ అటెండెన్స్‌ను ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ అమలు కోసం ప్రత్యేకంగా యాప్‌ను ఆయా వసతి గృహాలకు చెందిన హాస్టల్ సంక్షేమ అధికారికి అప్పగించనున్నారు. ఎంపిక చేసిన ప్రతి హాస్టల్‌కు చెందిన విద్యార్థుల ఫొటోలు తీసి ఆధార్, ఫోన్ నంబర్, చిరునామా, తరగతి తదితర వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. యాప్ ఉన్న మొబైల్ ఫోన్ పరికరాల్లోనూ విద్యార్థి ముఖం చూపిస్తే హాజరు నమోదవుతుంది. ఉదయం ప్రార్థన, సాయంత్రం స్కూల్ సమయం తర్వాత ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేస్తారు. దీనివల్ల ఏ వసతి గృహంలో ఏరోజు ఎంతమంది విద్యార్థులు ఉన్నది తెలుస్తుంది. ఈ విధానం వల్ల హాస్టళ్లలో బోగస్ హాజరుకు చెక్ పడుతుంది. బోగస్ హాజరు చూపి బిల్లులు డ్రా చేసుకుని ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసేందుకు ఇక వీలు ఉండదు.

రెండు హాస్టళ్లు ఎంపిక..

జిల్లాలోని ఏలూరు, బుట్టాయిగూడెం వసతి గృహాల్లో ఫేస్ రికగ్నేషన్ విధానం అమల్లోకి తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టాం. ఉదయం ప్రయోగాత్మకంగా పరిశీలించాం. ఇకపై బోగస్ అటెండెన్స్‌కు వీలు ఉండదు.

ఎ.వి. నాగరాణి, బీసీ వెల్ఫేర్ సాధికారిత జిల్లా అధికారి



మా సమస్యలు.. పట్టించుకోరా!

ఇంజనీరింగ్ విభాగ కార్మికుల ఆవేదన

- స్కిల్డ్ వర్కర్లకు సరైన వేతనాలు ఇవ్వాలి
- పని గంటలు నిర్ణయించాలి
- సాధారణ సెలవులు అమలు చేయాలి



ఏలూరు టూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడైనా సాధారణ కార్మికుల కంటే (అన్‌స్కిల్డ్) నైపుణ్యం గల (స్కిల్డ్) కార్మికులకు ఎక్కువ వేతనాలు ఇస్తారు. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం స్కిల్డ్ వర్కర్స్‌కు ఎక్కువ వేతనాలు ఇవ్వాలి. కానీ జిల్లాలోని నగరపాలక సంస్థ, మునిసిపాలిటీల్లోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న స్కిల్డ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులకంటే తక్కువ వేతనాలు ఇస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు జీవో నంబర్ - 36 ద్వారా నెలకు రూ.21 వేలు వేతనం ఇస్తుంటే నైపుణ్యం గల ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నంబర్ -7 ద్వారా రూ.15 వేలే ఇస్తున్నారు. సాధారణ కార్మికుల కంటే తాము ఎక్కువ పని చేస్తున్నా జీతాల్లో చాలా తేడా ఉందంటూ ఇంజనీరింగ్ కార్మికులు వాపోతున్నారు. కనీసం సాధారణ కార్మికులకు ఇచ్చినట్టుగా రూ.21 వేలు వేతనం ఇవ్వాలని పదేళ్లుగా పోరాడుతున్నా ఫలితం లేదని వాపోతున్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు పారిశుధ్య కార్మికుల్లాగా వారంతపు సెలవులు, క్యాజువల్ లీవ్‌లు ఉండవు. రోజుకు 12 గంటలు కొన్నిసార్లు 24 గంటలు పని చేయాల్సి ఉంటుంది. రోజురోజుకి పట్టణాలకు వలసలు ఎక్కువయ్యాయి. ప్రస్తుతం పట్టణాల్లో దాదాపు 40 శాతం పైగా నివసిస్తున్నారు. వీరందరికి తాగునీరు, వీధిలైట్లు, భూగర్భ డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణం, పార్కుల నిర్వహణ, దోమల నివారణ, పందులు, కుక్కల నిర్మూలన ఇలాంటి 36 రకాల సేవలను అందిస్తున్నారు. ఏలూరు నగర పాలక సంస్థలో 250, నూజివీడు మునిసి పాలిటీలో 40 మంది, జంగారెడ్డిగూడెం 40, చింతలపూడిలో 20 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్కిల్డ్‌వర్కర్లకు కనీసం రూ.21వేలు వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

చాలీచాలని జీతంతో ఎలా బతకాలి..

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో కేవలం నెలకు రూ.15 వేలు జీతంతో కుటుంబాన్ని ఎలా పోషించు కోవాలి. పిల్లల చదువులకు, కరెంటు బిల్లులు, ఇంటి అద్దెలతో సతమతం అవుతున్నాం. ఒక పక్కన అనారోగ్యం, వైద్యఖర్చులు పెరిగిపోతున్నాయి. కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలి.

- కె.సాంబశివరావు, కార్మికుడు

కనీస వేతనాలు ఇవ్వాలి



ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే స్కిల్డ్ వర్కర్లకు కనీసం వేతనం రూ.21 వేలు ఇవ్వాలి. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. రోజుకు 8, 10 గంటలు కేటాయించాలి. సాధారణ సెలవులు, వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలి.

- బి.సోమయ్య, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- కలెక్టర్ కె.వెట్రిసెల్వి
- అధికారులతో సమీక్ష

ఏలూరుసిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 5న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో గురు వారం ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్‌తో కలసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు డిసెంబరు 5న జిల్లాలోని 20 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతాయని, 9న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. 12వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఎక్కడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరగకుండా అధికారులు చూడాలన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు 2,605 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల నిర్వహణకు 144 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఓటర్లను ప్రలోభపరిచే చర్యలు ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని, అటువంటివి గుర్తిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. పోలింగ్‌కు 48 గంటలు ముందు నుంచి మద్యం అమ్మకాలు నిలిపివేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఎటువంటి శాంతి భద్రతలకు ఎటువంటి సమస్య రాకుండా పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు , ఆర్డీఓలు అచ్యుత్‌అంబరీష్, వాణి, ఎంవీ రమణ, ఎల్‌డీఎం నీలాద్రి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీపీవో కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యాన పంటల సాగులో 20 శాతం వృద్ధిరేటు సాధించాలి

జిల్లాలో ఉద్యానవన సాగులో 20 శాతం వృద్ధిరేటు సాధించడానికి రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి చెప్పారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాలో ఆయిల్ పామ్, ఇతర ఉద్యానవన పంటల వృద్ధిపై రైతుల సమస్యలు , ప్రభుత్వ ప్రోత్సాహంపై రైతులకు అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులు తెలిసిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయిల్‌పామ్ అధికదిగుబడి సాధనకు కృషి చేసిన రైతులు, శాస్త్రవేత్తలను సన్మానించారు. ఉద్యాన శాఖ డీడీ ఎస్.రామ్మోహన్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ హిమాంశు, మైక్రో ఇరిగేషన్ పీడీ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి ఖాతాలకు సొమ్ము జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు జేసీ ధాత్రి రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాలు, సహకార, మార్కెటింగ్ , వ్యవసాయ శాఖాధికారులతో ఆమె సమీక్షించారు. గతనెల 22వతేదీ నుంచి నేటి వరకు రూ. 136.44 కోట్లు విలువైన 58,102.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సమీప రైస్‌మిల్లులకు తరలించామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి : ఎస్పీ



ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై బ్యాంకు ఖాతాదారులకు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ వెల్లడించారు. బ్యాంకుల వద్ద భద్రత, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బ్యాంకు అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల్లో ఎక్కడ నుంచి నేరం చేస్తున్నారనేది గుర్తించడానికి బ్యాంకుల సహకారం అవసరమన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కు సమాచారం అందించాలన్నారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీలు డి.శ్రావణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఏవీవీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఐదుగురు అభ్యర్థులు

6

• చలిలో.. వెచ్చ వెచ్చగా..



జిల్లాలో చలి గాలులు వీస్తున్నాయి. రెండు, మూడు రోజులుగా సాయంత్రం అయ్యే సరికి రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నాయి. తెల్లవారుజామున పొగ మంచు కమ్మేస్తోంది. వణికిస్తున్న చలికి జనం దుప్పట్లలో నుంచి ముసుగులు తీయడం లేదు. గ్రామాల్లో చలి మంటల తో జనం సేద తీరుతున్నారు.

CUB TRUST AND EXCELLENCE SINCE 1904
సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద ఈ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

ఈ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఏలూరు శాఖ, డి.నం.22సి-14-11, గ్రౌండ్ ఫ్లోర్, బివికె మాల్, పుణ్యమూర్తుల వారి వీధి, పవర్‌పేట్, ఏలూరు, పశ్చిమగోదావరి-534002. వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్డను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.0881-2240340, సెల్ నం.9347078103లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన ఛార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ ఛార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 07.10.2024 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

అంతా మా ఇష్టం..

ట్రాఫిక్ నిబంధనలు గాలికి..







'ఎవరు అడ్డొస్తే మాకేంటి.. మా దారి రహదారి' అంటూ కొందరు వారికి ఇష్టం వచ్చినట్టు ఏలూరు నగర రోడ్లపై దూసుకుపోతున్నారు. అడ్డదిడ్డంగా ప్రయాణిస్తూ రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఇక్కడ కనిపిస్తున్న దృశ్యాలన్నీ గురువారం ఏలూరు నగరంలో ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కినవే.. జూట్‌మిల్, ఫైర్‌స్టేషన్ సర్కిళ్లలో సిగ్నల్స్ వెలుగుతున్నా అడ్డదారిలో వెళ్లిపోతున్నారు. వీరిని చూసి కొంత మంది అంత తొందర ఎందుకు అంటూ ప్రశ్నించినా తమకేమీ పట్టనట్టుగానే బైక్‌ల వేగం పెంచుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)





ఏలూరులో అలా ఉంటే భీమవరంలో మరోలా ఉంది.. 'సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం.. రెప్ప పాటులో ప్రమాదం జరిగిపోతుంది.. ఇలా డ్రైవింగ్ చేయడం నేరం కూడా.. జరిమానా, జైలుశిక్ష కూడా ఉంటుంది' అని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.. ట్రాఫిక్ నిబంధనలు తమకు కాదన్నట్టుగా వెళ్లిపోతున్నారు.. గురువారం భీమవరంలో పలు సెంటర్లలలో కనిపించిన దృశ్యాలివి..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)





ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఐదుగురు

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణలు

వచ్చేనెల 5న పోలింగ్.. 9న కౌంటింగ్

కాకినాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణలు గురువారం ముగిశాయి. ఒకే ఒక్క అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా ఎన్నికలబరిలో ఐదుగురు అభ్యర్థులు నిలిచారు. ఎన్నికల బరిలో నిలిచినవారిలో బుర్రా గోపి మూర్తి, గంథం నారాయణరావు, నామన వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్ ఉన్నారు. ఇక నుంచి వీరు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమవ్వనున్నారు. వచ్చేనెల 5న పోలింగ్ జరగనుంది. 9న కౌంటింగ్ జరగనుంది. దీనికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. మొత్తంగా 16,316 మంది ఓటు హక్కు విని యోగించుకోనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2893 మంది, ఏలూరు జిల్లాలో 2605 మంది, కాకినాడ 3333 మంది, కోనసీమ 3209 మంది, పశ్చిమ గోదావరి 3662 మంది ఓటర్లు ఉన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఉండగా, దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, కోనసీమ జిల్లాలో 22, పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.



వైభవంగా మావుళ్లమ్మ జ్యోతియాత్ర

భీమవరంటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) మావుళ్ళమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న అమ్మవారి దీక్షల్లో భాగంగా గురువారం రాత్రి మాలధారులతో జ్యోతియాత్ర చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద మాలధారులతో ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 400 మంది మాలధారులు జ్యోతులను చేతప ట్టుకుని మావుళ్ళమ్మ శరణు ఘోషతో, మంగళ వాయిద్యాలతో ప్రత్యేకంగా తయారుచేసిన వాహనంలో అమ్మవారి ఫొటో ఉంచి యాత్ర నిర్వహించారు. ఆలయం నుంచి బయలు దేరి ప్రధాన వీధుల మీదుగా చివరగా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. ఈవో బుద్దమహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు.



తపాలా బిళ్లపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్న దృశ్యం

తపాలాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

భీమవరం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి తపాలా బిళ్ళ 1947 నవంబరు 21న విడుదల య్యాయని, దీని విలువ మూడున్నర అణాలని హెడ్ పోస్టు మాస్టర్ రాజు, అసిస్టెంట్ పోస్టు మాస్టర్ నాగమణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో భీమవరం పోస్టల్ శాఖ కార్యాలయంలో స్వతంత్ర భారతదేశపు మొట్ట మొదటి తపాలా బిళ్ళ విడుదలైన సంద ర్భంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. తపాలా బిళ్ళలు తపాలా వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగమని అన్నారు. తపాలా వ్యవస్థ ద్వారా పంపే లేఖలు, ఇతర సామగ్రి సంఖ్యను గణనీయంగా పెంచిం దన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. పోస్టల్ పీఆర్వో సత్యనారాయణ, యూనియన్ నాయకులు లెనిన్, చెరుకువాడ రంగసాయి, పోస్టల్ ఆఫీసర్ వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరంతటికీ ఈ నుయ్యే ఆధారం



ఆచంట వేమవరంలో ఉన్న సీతమ్మ నుయ్యి

వందల సంవత్సరాల నాటి బావులు శిథిలా వస్థకు చేరి ప్రస్తుతం నిరూపయోగంగా మారాయి. మారిన జీవన విధానంతో పాటు భూగర్భ జలాల్లో వచ్చిన మార్పుల కారణంగా బావుల నీటిని వినియోగించేవారు తగ్గి పోయారు.పూర్వం చెరువులు ఉన్నప్పటికి మంచి నీటి కోసం గ్రామంలో ఒక చోట పెద్ద నుయ్యి ఏర్పాటు చేసి బండరాళ్ళతో చుట్టు రక్షణ గోడలను కట్టేవారు. గ్రామస్థులంతా

కనుమరుగవుతున్న బావులు

నుయ్యిలోని నీటినే తాగునీటిగా ఉపయోగించే వారు. ఊరందరికి ఇటువంటి బావులు ఎంత గానే ఉపయోగపడేవి. ఆచంట వేమవరం పంచాయతీ వద్ద ఉన్న సీతమ్మ నుయ్యి 1822లో గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ బావికి 200 ఏళ్ళ చరిత్ర ఉంది. ప్రస్తుతం ఈ నుయ్యి పూర్తిగా పాడైపోయింది. 2018లో గ్రామానికి చెందిన వరదాచార్యులు, సత్యకు మారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ నుయ్యిని పునర్‌నిర్మాణం చేపట్టారు.నుయ్యి లను శుభ్రం చేసి కాపాడుకుంటే తాగునీటి కొరత ఉండదని పలువురు భావిస్తున్నారు. చాలా గ్రామాల్లో ఉన్న నుయ్యిలు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. ఏళ్ళనాటి బావులను శుభ్రం చేసుకుని కాపాడుకుంటే తాగునీటి సమస్య ఉండదని పలువురు అంటున్నారు.

- ఆచంట/ఆంధ్రజ్యోతి

గజ.. గజ



జంగారెడ్డిగూడెంలో చలిమంట కాగుతూ..



17 డిగ్రీలకు పడిపోయిన రాత్రి పూట ఉష్ణోగ్రతలు

నాలుగు రోజులుగా పెరిగిన చలిగాలులు

ఏజెన్సీలో చలితో గజగజ

వెంటాడుతున్న అనారోగ్యాలు

ఏలూరుసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చలి గాలులు చంపేస్తున్నాయి. సాయంత్రం అయ్యేసరికి చలి తీవ్రత ఉగ్రరూపం దాలుస్తోంది. నాలుగు రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతున్నాయి. గురువారం ఏలూరు జిల్లాలో చలి తీవ్రత రాత్రి సమయంలో 17 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదు అవుతోందని ఇంటర్‌నెట్ సమాచారం ద్వారా తెలుస్తోంది. జిల్లాలోని ఏజెన్సీ మండ లాల్లో రాత్రి సమయాల్లో చలిని తట్టుకోవడం ప్రజలకు కష్టతరంగా తయారైంది. చలిని తట్టుకోలేక అనారోగ్యాల పాలవుతున్నారు. చలి తీవ్రత కారణంగా శ్వాసకోశ సంబంధ వ్యాధు లతో పాటు జలుబు, జ్వరం భారిన పడు తున్నారు. పగటి పూట ఉష్ణోగ్రతలు 31 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదు అవుతున్నా రాత్రి పూట ఉష్ణోగ్రతలు మాత్రం కనిష్ట స్థాయికి పడిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి నవంబరు నెలలోనే కనిష్ట ఉష్ణోగ్రతలు తారస్థాయికి పడిపోయాయి. నవంబరు 18 వతేదీ నుంచి 21 వతేదీ వరకు పరిశీలిస్తే జిల్లాలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 19 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మరింత ఎక్కువగా చలిగాలులు వీస్తున్నాయని చెబుతన్నారు.రాత్రి సమయాల్లో జనం బయటకు రావటానికే భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏజెన్సీ మండలాలతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాలైన విలీన మండలాల్లోను, జంగారెడ్డి గూడెం పట్టణంలోను , కృష్ణా పరివాహక ప్రాంతాలలోను రాత్రి పూట చలి తీవ్రత విపరీతంగా పెరిగింది.

బయటకు రావడం లేదు

తెల్లవారుజామున, పగటి పూట కూడా చలి తీవ్రత ఎక్కువగా ఉండ టంతో రైతులు పంటపొలాలకు వెళలేకపోతున్నారు. కూలీలు కూడా చలిని తట్టుకోలేక పనులకు ఆలస్యంగా వెళ్లాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.రాత్రి సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు తగ్గాయి. రాత్రి సమయాల్లో రహదారులపై జనసంచారం అంతంత మాత్రంగానే ఉంటోంది. చలి తీవ్రతను తట్టుకోవటానికి ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. వారం రోజులుగా ఉన్ని దుస్తుల అమ్మకాలు కూడా పెరిగాయని వ్యాపా రస్తులు చెబుతున్నారు. ఏలూరు నగరంతో పాటు జిల్లా లోని మిగిలిన పట్టణాలు,పలు మండల కేంద్రాల్లో ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి.

జ్వరాల భయం

చలి తీవ్రత కారణంగా ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ముఖ్యంగా రొంప, జ్వరం దగ్గులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గొంతు సంబంధిత వ్యాధులు ఎక్కువగా సంక్ర మిస్తున్నాయని చెబుతున్నారు. చలిగాలుల కార ణంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై బయటకు ప్రయాణాలు తగ్గించారు. గత నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతల వివరాలు ఇవీ..

తేదీ	గరిష్ట / కనిష్ట
నవంబరు 18	31/19
నవంబరు 19	31/19
నవంబరు 20	31/18
నవంబరు 21	31/17

ఆరోగ్యానికి రక్షణ..ఉన్ని దుస్తులు



శీతాకాలంలో వీచే చలిగాలులకు జలుబు, దగ్గు, జ్వరం వస్తాయి. చలికాలంలో కూడా అనారోగ్యం పెరిగే ప్రమాదం ఉంది. చలిలోకి వెళ్తే సంపూర్ణ ఆరోగ్యవంతులు సైతం అనారోగ్యం భారినపడతారు. రగ్గులు, స్వెట్టర్లు మంకీ క్యాప్‌లు వాడటం వల్ల రక్షణ పొంద వచ్చు. చిన్నారులు ఎక్కువగా చలిగాలిలో తిరగ కుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆక్వా చెరువుల మీద పనిచేసే రైతులు, కార్మికులు కూడా స్వెట్టర్లు వినియోగించాలి.

- సంతోష్ నాయుడు, ప్రభుత్వ వైద్యాధికారి, గణపవరం

అమ్మకాలు బాగానే ఉన్నాయి



మధ్యప్రదేశ్, రాజస్థాన్, కశ్మీర్, నేపాల్ తదితర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన రగ్గులు, ఇతర ఉన్ని దుస్తులకు డిమాండ్ బాగానే ఉంది. అమ్మకాలు బాగా ఉండటంతో ఏటా గణపవరం ఇండియన్ బ్యాంకు సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేస్తుంటాం. షాపుల్లో కంటే మా వద్ద తక్కువ ధరలు ఉండటం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇక్కడే కొంటారు. అమ్మకాలు ముగించుకుని ఫిబ్రవరి నెలలో తిరిగి మా స్వస్థలానికి వెళ్లిపోతాం.

-భగవాన్ సింగ్ , వ్యాపారి, మధ్యప్రదేశ్

చలి కాలపు నేస్తాలకు గిరాకీ



గణపవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో క్రమేపీ చలి తిరుగుతోంది. సాయంత్రం 4 దాటితే చలిప్రభావం చూపుతుంది. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన మంచు కురుస్తోంది. రగ్గులు, స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు బయటకు తీస్తున్నారు. లేనివారు కొనుగోలు చేస్తున్నారు. పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, నేపాల్, నుంచి వ్యాపారులు వచ్చి గణపవరం మెయిన్ రహదారిలో దుకాణాలు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. రగ్గులు, స్వెటర్లు, మఫ్లలర్లు, మంకీక్యాంపులు, శాలువాలు, హ్యాండ్‌గ్లౌజ్‌ల అమ్ముతున్నారు.ప్రతీ ఏటా నవంబర్‌లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వ్యాపారులు వచ్చి ఫిబ్రవరి వరకు నాలుగు నెలల పాటు ఇక్కడే కుటుంబాలతో మకాం వేసి ఉన్ని దుస్తులు విక్రయిస్తారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో వీరి వ్యాపారం జోరుగా సాగుతుంది. నాలుగు డబ్బులు సంపాదించుకుని స్వరాష్ట్రాలకు వెళ్లిపోతుంటారు. గత ఏడాదితో పోలిస్తే రగ్గులు, స్వెట్టర్లు, తదితర దుస్తుల ధరలు అధికంగానే ఉన్నాయి. సైజును బట్టి రగ్గులు రూ. 400నుంచి 800 వరకు, స్వెట్టర్లు రూ.400 నుంచి 500 వరకు విక్రయిస్తున్నారు. మఫ్లర్లు, మంకీక్యాప్‌లు రూ.40 నుంచి 80 వరకు విక్రయిస్తున్నారు.

పిట్ట కొంచెమే.. కూత ఘనం

రాష్ట్రాల రాజధాని పేర్లతో పాటు 500 పదాలు అనర్గళంగా చెబుతోన్న శ్రీజ

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో దొడ్డన పూడికి చెందిన మూడేళ్ల చిన్నారి

కాళ్ళ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్టుగా ఆ చిన్నారి మూడేళ్ల వయసులోనే అనర్గళంగా ఇంగ్లీషు పదాలు, అర్థాలు చెప్పి అందిరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతేకాదు.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించి శెభాష్ అనిపించుకుంది.. అ, ఆ..లు కూడా రాని ఆ చిన్నారి దేశంలోని అన్ని రాష్ట్రాలు, వాటి రాజధా నులు పేర్లు ఇంగ్లీషులో చెప్పడంతో పాటు, మానవ శరీరంలోని అన్ని అవయవాల పేర్లను ఇంగ్లీషులో చెప్పేస్తోంది.చిన్నారి గ్రహించే శ క్తిని, ప్రతిభా పాటవాలను గుర్తించిన తల్లితం డ్రులు మరింత ప్రోత్సాహం ఇవ్వడంతో సుమారు 500 పదాలు ఇంగ్లీషులో చెప్పడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధిం చింది. వివరాల్లోకి వెళితే కాళ్ళ మండలం దొడ్డన పూడి గ్రామానికి చెందిన కొల్లి శివ సత్యనారా యణ, నవ్యశ్రీ దంపతులకు ఇద్దరు అమ్మాయిలు.. పెద్ద అమ్మాయి విద్యాశ్రీవల్లి (ఐదేళ్లు) ఎల్‌కెజీ చదువుతోంది. చిన్న పాపకి జస్వికశ్రీజ (మూడేళ్లు). శివసత్యనారాయణ వ్యవసాయం చేస్తున్నారు. నవ్యశ్రీ డిగ్రీ చదివి గృహిణిగా ఉంది. సుమారు ఆరు నెలల క్రితం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి జస్వి కశ్రీజను తీసుకు వెళ్లగా అక్కడ ఉన్న పుస్తకాలు, బొమ్మలను ఆసక్తికరంగా చూస్తూ వాటి పేర్లను అడిగి తెలుసుకుంది. చిన్నారి చెబుతున్న అంశాలను కాకతాళీయంగా ఫోన్లో చిత్రీకరించి ఆ తల్లి యూట్యూబ్ ద్వారా పోస్టు చేశారు. జస్వికశ్రీజ 60 జీవులు, 15 వాహనాలు, 11 దేవ తామూర్తులు, 32 వస్తువులు, 5 లోహాలు, 22 గృహోపకరణాల పేర్లను గుర్తించడం, 15 రకాల పండ్లు, 33 కూరగాయలు, శరీరంలోని 37 భాగాలు, 14 వ్యతిరేక పదాలు, 6 ఆంగ్ల నర్సరీ రైమ్స్ చెప్పడం, 3 సంవత్సరాల వయసులో 1 నుంచి 20 వరకు లెక్కించడం, 13 తెలుగు పదా లను ఆంగ్లంలోకి అనువదించి చెప్పిన వీడి యోలను చూసి అక్టోబరు 21న ఇండియా బుక్ ఆఫ్ రికార్డు (ఐబీఆర్) అచీవర్‌గా చిన్నారి పేరును నిర్ధారించినట్లుగా నిపుణులు బృందం నుంచి మెయిల్ రావడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందానికి అవధులు లేకుండా పో యాయి. హర్యానాకు రావాలని చెప్పడంతో వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రాలేమని చెప్పడంతో కొరియర్ ద్వారా మెడల్, సర్టిఫికెట్, ఐడీ కార్డు, ఇండియా ఆఫ్ రికార్డు పుస్తకం, బ్యాడ్జ్, పెన్, స్టిక్కర్లు వచ్చాయన్నారు. గ్రామ పెద్దలతో కలిసి వీటి అన్నింటినీ తీసుకుని జిల్లా కలెక్టర్ నాగరాణిని కలవగా చిన్నారిని అభినంద నలతో ముంచెత్తినట్టు ఆనందంతో తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలతో చిన్నారి జస్వికశ్రీజ



కలెక్టర్ నాగరాణిని కలిసిన చిన్నారి



కుటుంబ సభ్యులతో చిన్నారి శ్రీజ

24న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీని యర్ పురుషుల బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు ఈనెల 24న మార్టేరు జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారెడ్డి, గవ్వా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 6 నుంచి 9వ తేదీవరకు మార్టురులో 10వ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పురుషుల, మహిళల, ఛాంపియన్‌షిప్ పోటీలు జరగను న్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పురుషుల జట్టు ఎంపిక, 24న మార్టేరులో నిర్వహిస్తున్నట్లు ట్రెజరర్ మురళీకృష్ణ తెలి పారు. వివరాల కోసం 94411 71933 నంబర్లో సంప్రదించాలని కోరారు.

28న కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 8వ తేదీన ఏలూరు అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ అధ్యక్షుడు జిల్లా వీరభద్రరావు పుట్టిన రోజును పురస్కరిం చుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల మొదటి కిడ్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వ హిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 28న ఉద యం 8 గంటలకు ఎంపికలు జరుగుతాయ న్నారు. అండర్-8,10,14,16,18 విభాగాల్లో బాల, బాలికలు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు నగదు బహుమతి,మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికలు అందచేస్తారన్నారు.వివరాలకు 62814 31202 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

శబరిమలైకు రైళ్లేవీ..

» జిల్లాకు మొండిచేయి » మచిలీపట్నానికి పెద్ద పీట » అయ్యప్ప భక్తుల్లో నిరాశ



నరసాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈసారి అయ్యప్ప కొండకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే ఎక్కువ సంఖ్యలో స్పెషల్ రైళ్లను ప్రకటించినప్పటికి జిల్లాకు మాత్రం మొండి చేయి చూపింది. కనీసం ఒక రైలు కూడా వేయలేదు. గతంలో నరసాపురం నుంచి నాలుగు ట్రిప్‌లు స్పెషల్ రైళ్లు వెళ్లేవి. ఈసారి ఇవన్ని మచిలీపట్నం తరలిపోయాయి. దక్షిణమధ్య రైల్వే ప్రకటించిన 18 స్పెషల్ రైళ్లల్లో మచిలీపట్నం నుంచి ఐదు రైళ్లు ఉన్నాయి. కృష్ణాజిల్లాకు పెద్ద పీట వేసి గోదావరి జిల్లాలపై రైల్వే చిన్న చూపు చూపడం పట్ల భక్తులు మండిపడుతున్నారు. సాధారణంగా నరసాపురం, కాకినాడ నుంచి ఏటా స్పెషల్ రైళ్లు నడుస్తాయి. కాకినాడ నుంచి వెళ్లే రైళ్లు టీపీగూడెం, నరసాపురం నుంచి వెళ్లే రైళ్లు పాలకొల్లు, భీమవరం, కైకలూరులతో పాటు నరసాపురం సరిహద్దున్న కోనసీమ జిల్లాకు చెందిన భక్తులు నరసాపురం, పాలకొల్లు స్టేషన్ల నుంచి తరలి వెళుతుంటారు. ప్రత్యేక రైళ్లు వేస్తే ఇక్కడే ఫుల్ అయిపోతాయి. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈసారి కూడా జిల్లా నుంచి ఎక్కువ రైళ్లు వేస్తారని భక్తులు ఎదురు చూశారు. కానీ రెండు స్టేషన్ల నుంచి ఒక్క రైలు కూడా వేయలేదు. దీంతో శబరిమలై వెళ్లే జిల్లా భక్తులు మచిలీపట్నం లేదా గుడివాడ వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు కల్పించుకుని రద్దీకి అనుగుణంగా జిల్లా నుంచి అయ్యప్పకొండకు ప్రత్యేక రైళ్లు నడిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కేంద్ర మంత్రి వర్మకు పితృవియోగం

హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తండ్రి సూర్యనారాయణరాజు మృతి చెందారు. భౌతికకాయానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి జి.కిషన్‌రెడ్డి నివాళులర్పించి, అక్కడే వున్న కుటుంబ సభ్యులను పరామర్శించారు.



కానిస్టేబుల్ విష్ణు రక్తదానం

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రైవేటు హాస్పటల్‌లో 16 నెలల చిన్నారి గుండె ఆపరేషన్‌కి సింగిల్ డోనర్ ప్లేట్స్ కోసం ఏబీ రక్తదాత కావలెనని సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసిన చాట్రాయి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ విష్ణు హుటాహుటిన బెజవాడ వెళ్ళి రక్తదానం చేశారు. చిన్నారి గుండె ఆపరేషన్‌కు రక్తదానం చేసిన విష్ణుని ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది అభినందించారు.

ఇంట్లోకి చొరబడి ఆభరణాల దోపిడీ

పెదవేగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంఘటన పినకడిమిలో జరిగింది. ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పినకడిమి గ్రామానికి చెందిన గంధం యాదగిరమ్మ అనే 70 ఏళ్ళ వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంట్లో టీవీ చూస్తుండగా గుర్తు తెలియని యువకుడు ఇంట్లో ప్రవేశించి, తలుపు గడియపెట్టి, వృద్ధు రాలి మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులను బలవంతంగా తెంపుకుని పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్రైమ్ కార్నర్



రైలు పట్టాలపై పడి ఉన్న వృద్ధుడు

వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలోని వట్లూరు రైల్వే స్టేషన్ దగ్గరలో రైలుపట్టాలు పక్కన ఒక వృద్ధుడు పడి ఉన్నాడని 108 అంబులెన్సుకు సమాచారం అందింది. దీంతో ఏలూరు 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటీన వెళ్ళి వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వచ్చిన కొద్దిసేపటికే అతను మృతి చెందాడు. వట్లూరుకు చెందిన ఇంటూరి సత్యనారాయణ (72) గురువారం ఉదయం తన ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్ళాడు. రైలు పట్టాలుపక్కన అతను అనుమానాస్పదంగా పడి ఉన్నాడు. ఏదైనా రైలు ఢీకొందా లేదా మరే ఇతర అనారోగ్య కారణంతో పడిపోయాడా అనే విషయాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 కాసుల బంగారం అపహరణ

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటిలో ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు ఆదివారపుపేటకు చెందిన పేరూరి సుకన్య తమ కుటుంబ సభ్యులు ఒక స్టేషనరీ షాపు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది అక్టోబర్ 8వ తేదీన ఉదయం 9 గంటలకు సుకన్య ఆమె భర్త ఇంటికి తాళం వేసుకుని స్టేషనరీ షాపునకు వెళ్ళిపోయారు. 10.30 గంటలకు ఆమె అత్తగారు వచ్చి ఇంట్లో తలుపులు దగ్గరకు వేసి పడుకున్నారు. ఆ తరువాత ఇంట్లో పెట్టిన 11 కాసుల బంగారు ఆభరణాలు కనిపించడం లేదు. గురువారం ఏలూరు టూటౌన్ పోలీసులకు సుకన్య ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

భీమవరం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళుతున్న ఒక కుటుంబాన్ని పక్కనే వెళుతున్న మరో మోటార్ సైక్లిస్టు ఢీకొట్టిన ప్రమాదంలో గాయాలు అయ్యాయి. పట్టణానికి చెందిన బూరా మోహన రవితేజ అతని భార్య కలిసి కుమారిడిని పాఠశాల నుంచి తీసుకురావడం కోసం ఈనెల 20వ తేదీన వెళ్ళారు. తిరిగి ముగ్గురు వస్తుండగా పక్కనే బస్తాలతో వెళుతున్న మోటార్ సైక్లిస్టు వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ముగ్గురు కిందపడి గాయాల పాలయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రహమాన్ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

కాపాడిన కానిస్టేబుల్



కానిస్టేబుల్ నాగేశ్వరరావు

పెనుమంట్ర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న వృద్ధురాలు తనువు చాలించాలని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. మాముడూరుకి చెంది న(65) సంవత్సరాల వృద్ధురాలు మాముడూ రు కాలవలోకి దూకి ఆత్మహత్యా యత్నం ప్రయత్నించింది సమాచారం అందుకున్న కాని స్టేబుల్ పి.నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరి వృద్ధురాలను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో వృద్ధురాలను కాపాడిన ఈ సంఘటనతో ఉన్నతాధికారులు నాగేశ్వరరావును అభినం దించారు

పేకాట స్థావరంపై దాడి

రూ.3.60 లక్షలు నగదు, కారు, బైక్ స్వాధీనం

ద్వారకాతిరుమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలో పేకాట స్థావరంపై గురువారం రాత్రి ద్వారకాతిరుమల పోలీసులు దాడి చేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో ఐదుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,60,500 నగదు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో భీమడోలు సీఐ యుజె.విల్సన్, ఎస్‌ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌ఐ సుధీర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఉపేక్షించబోయేదిలేదని హెచ్చరించారు. కోడిపందేలు, పేకాట వంటివి నిర్వహిస్తే 112కు గాని లేదా 9440796653కి గాని తెలియపర్చాలని అన్నారు.



మాట్లాడుతున్న జేడీ ప్రసాద్

నదీ జలాలు కలుషితం కాకుండా చూడాలి

నరసాపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నదీ, సముద్ర జలాలు కలుషితం కావడం వల్ల మత్స్యకారులకు దొరికే మత్స్య సంపద హరించి పోతుందని, దీన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్డీవో దాసిరాజు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మత్స్యశాఖ జేడీ ఆర్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి అనేక పథకాలు, సబ్సిడీలు అందిస్తుందన్నారు. అనంతరం సాగులో మంచి ఫలితాలు సాధించిన వారిని సత్కరించారు. జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు, ఏడీ లక్ష్మీనర్సింహరాజు, ఎఫ్‌డీవో వివేక్ పాల్గొన్నారు. పట్టణంలోని ఫిష్ మార్కెట్ వద్ద మత్స్య నారాయణ స్వామికి పూలమాలలు వేశారు. పెమ్మాడి గణపతిరాజు, సంగాని వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నాకు పిల్లల్ని దూరం చేయకండి

మృతురాలి భర్త ఆవేదన



తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తాను భార్యను కోల్పోయానని ఇప్పుడు పిల్లల్ని కూడా దూరం చేసేందుకు చూస్తున్నారని జగన్నాథపురంలో హత్యకు గురైన నాగశ్రావణి భర్త లక్కోజు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో గురువారం ఆవేదనను తెలియజేశాడు. తాను ఇంట్లో జరిగిన కొన్ని గొడవల వల్ల తన భార్యను కోల్పోయానని తన తండ్రి నాగేశ్వరరావు తెలిసి తెలియక చేసిన నేరానికి తాను అన్నింటికి దోషిగా మిగిలానని ఇప్పుడు పిల్లల్ని కూడా చూడలేని పరిస్థితుల్లో ఉన్నానన్నారు. తన పిల్లలకు ఇస్తానన్న ఆస్తిని రాసిచ్చామని, అరెకరం పొలం కూడా సాంకేతిక సమస్య తీరిన తరువాత రాసేస్తానన్నారు. తమ కుటుంబాన్ని రోడ్డున పడేసిన పెద్దలు అంతా ఆలోచించాలని కోరారు. శ్రీనివాసరావు వెంట ఆయన తండ్రి కేశవరావు, అన్న నాగబాబు, తల్లి ఉన్నారు.

అప్పులు తీర్చేందుకు చోరీల బాట!

» ముగ్గురి అరెస్టు

నిడదవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడి చేసి బంగారం చోరీ చేసిన కేసులో ముగ్గురు పోలీసులకు చిక్కి జైలుకెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన చెల్లు బోయిన సత్యనారాయణ, తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలానికి చెందిన పాకా వీరాస్వామి అప్పులు చేసి దుబాయ్ వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఒకే రూమ్‌లో కలిసి ఉండేవారు. దీంతో స్నేహితులయ్యారు. దుబాయ్‌లో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఇటీవల తిరిగి ఇండియాకు వచ్చేశారు. అయితే అప్పులు తీర్చే మార్గం కానరాలేదు. మరో వైపు చెడు వ్యసనాలు.. దీంతో పాకా వీరాస్వామి ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ ఈ నెల 6వ తేదీన నిడదవోలు గాంధీనగర్‌లో ఒక వృద్ధురాలు ఒంటరిగా నివసించడం గమనించాడు. ఈ విషయం స్నేహితుడు సత్యనారాయణకు చెప్పాడు. వృద్ధురాలిపై దాడి చేసి బంగారం ఎత్తుకుపోయేలా ప్లాన్ వేశారు. ఈ మేరకు మరో స్నేహితుడు పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలానికి చెందిన సమ్మింగి సన్యాసిరావు సహాయం తీసుకున్నారు. ఈ నెల 8వ తేదీన ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు నూలి అన్నపూర్ణమ్మపై దాడిచేసి బంగారం దోచుకు పోయారు. ఇది సక్సెస్ కావడంతో బుధవారం మళ్లీ మరో నేరం చేయ డానికి ప్రణాళిక వేసేందుకు నిడదవోలు రాగా పోలీసుల నిఘా మేరకు పట్టుకున్నారు. సీఐ తిలక్, ఎస్‌ఐ శోభన్ కుమార్ చోరీ చేసిన బంగారాన్ని రికవరీ చేశారు. ముగ్గురుని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పర్చినట్టు తెలిపారు.

నడిపూడి ఇసుక ర్యాంపు అక్రమాలు పట్టవా..

» రోడ్డుపై బారులు తీరిన లారీలు.. » గ్రామస్థులకు అవస్థలు

పెనుగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దళారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా నడిపూడి ఇసుక ర్యాంప్‌లో పరిస్థితి ఉన్నది. ఇసుక ర్యాంప్‌లో జరుగుతున్న అక్రమాలపై అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై దళారులు ఇష్టారాజ్యంగా మారింది. ఇంత జరుగుతున్న మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, విజిలెన్స్ అధికారులు పత్తా లేకుండా పోవడంతో పలు అనుమానాలకు దారి తీస్తున్నది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నడిపూడి ఇసుక ర్యాంప్‌కు వెళ్లేందుకు లారీలు ఏటిగట్టు, రహదారులపై కిలో మీటర్లు మేర రహదారికి అడ్డుపెట్టారు. సిద్ధాంతం లంక భూములకు వెళ్లే రైతులు, శ్మశాన వాటికకు దహన సంస్కారాలకు చేసేందుకు మృతదేహాలను తీసుకెళ్ళే వారు అవస్థలు పడ్డారు.



రహదారికి అడ్డుగా పెట్టిన లారీలు

బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలతో జాగ్రత్త



ఎస్పీకి పాలకోడేరు పోలీసుల గౌరవ వందనం

పాలకోడేరు, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అద్నాన్ నయిమ్ అస్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, కేసుల డైరీ, విలేజ్ రోస్టర్, వివిధక్రైమ్ రికార్డులను పరిశీలించారు. బ్లాక్‌స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదం జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కల్పించేలా చూడాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగెనెస్ట్ ఉమెన్, గర్ల్ మిస్సింగ్, ప్రోపర్టికేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర రికార్డులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సహకరించాలన్నారు. డీఎస్పీ ఆర్.గణేష్, జయసూర్య, సీఐ శ్రీనివాసరావు, పాలకోడేరు ఎస్సై రవివర్మ పాల్గొన్నారు.

25న భారతీస్వామి అనుగ్రహ భాషణ

పాలకొల్లు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 24వ వార్డులోని శ్రీ శంభేశ్వర స్వామి ఆలయానికి ఈనెల 25వ తేదీ సాయంత్రం 4గంటలకు జగద్గురు విధుశేఖర భారతీస్వామి విచ్చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కలగ అచ్చయ్య శాస్త్రి తెలిపారు. ఈసందర్భంగా స్వామికి పూర్ణ కుంభ స్వాగతం, శ్రీ రత్నమాంబ సమేత శంభేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివార్ల దర్శనం అనంతరం అనుగ్రహ భాషణం ఉంటుంది. భక్తులు అందరూ విచ్చేయవలసిందిగా అచ్చయ్య శాస్త్రి ఒకప్రకటనలో తెలిపారు.

ఇన్‌చార్జి హెచ్‌ఎంకు నోటీసు జారీ

దెందులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జోగన్నపాలెం పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంకు ప్రభుత్వం షోకాజ్ నోటీసు జారీ చేసింది. జోగన్నపాలెం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా పర్యవేక్షణ చేయలేకపోవడం వలన 9 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుజాతకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ నోటీసులు ఇచ్చారు. పాఠశాలలో పిల్లలు తినే ఆహారం సరిగా ఉడకపోవడంతో పాటు శుభ్రంగా లేకపోవడం, మధ్యాహ్న భోజన నిర్వాహకులు చేసే వంటలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయక పోవడంతో నోటీసులు అందించమన్నారు.

ఇద్దరు దారి దోపిడీ దొంగల అరెస్టు

31.5 గ్రాముల బంగారపు వస్తువులు.. ఐదు వేల నగదు స్వాధీనం



నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై రాత్రి వేళ దారిదోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేశామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నేరస్తుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో డీఎస్పీతో పాటు భీమడోలు సీఐ యుజే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ పి.సుధీర్‌లు పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన ఆలూరి శాంతకుమార్ ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీ రాత్రి భీమడోలులో ఉన్న తన భార్య వద్దకు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. మార్గమధ్యలో ద్వారకాతిరుమల మండలం కప్పలగుంట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గల ఒక కల్వర్టు వద్ద ఆగాడు. అక్కడ పొలాల్లో దాగి ఉన్న ఇద్దరు యువకులు అకస్మాత్తుగా దాడి చేసి 10 వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్, బంగారపు ఉంగరాలను లాక్కొని అతని కాళ్ళు చేతులు కట్టి చెట్ల పొదల్లో పడవేసి పారిపోయారు. ఈసంఘటనపై ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఈ దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు వేల రూపాయల నగదు ఒక బంగారపు ఉంగరం, టార్చిలైట్, ఈ నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్ చేశారు. అరెస్టు అయిన నిందితులు రాజమహేంద్రవరం కొంతమూరులోని జంగాలకాలనీకి చెందిన మానిపాటి విజయ్‌కుమార్ (24) రాజమహేంద్రవరంలోని చింతలనామవరానికి చెందిన రామిరెడ్డి త్రిమూర్తులను అరెస్టు చేశామన్నారు. మానిపాటి విజయ్ కుమార్ అనేక దోపిడీలు, దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు నిందితుల నుంచి 31.500 గ్రాముల బంగారం (ఏడు ఉంగరాలు, రెండు గొలుసులు) ఒక టార్చిలైటు, ఐదు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్టు చేసిన పోలీసుల్ని ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



బోల్తా కొట్టిన ఆటో



చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

కైకలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు-కోరుకొల్లు ఆర్‌అండ్‌బీ రహదారిలో బొలెరా వ్యాను ట్రక్కు ఆటోను ఢీకొట్టిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం 4గంటల సమయంలో మండలంలోని శ్యామలాంబపురానికి చెందిన మత్స్యకారులు కైకలూరులో చేపల పట్టుబడికి ట్రక్కు ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యలో ఆచవరం చల్లాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో కాకినాడ నుంచి రొయ్యపిల్ల సీడ్‌తో మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం వెళ్తున్న బొలెరా వ్యాను ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఆటో రహదారిపై పల్టీలు కొట్టగా బొలెరా వ్యాను పక్కనే ఉన్న డ్రెయిన్‌లో తిరగబడింది. ఆటోలో ప్రయాణిస్తున్న టి.నాగలక్ష్మీ, ఎం.శ్రీరాములు, నరసింహస్వామి, బి.అప్పయ్య తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్‌పై పోక్సో కేసు



విలేకరులకు వివరాలు చెబుతున్న డీఎస్పీ శ్రీవేద

నరసాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మోసగించి కిడ్నాప్ చేసిన నిందితుడు చింతా నర్సింహస్వామిపై పోక్సో కేసు నమోదు చేశారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీవేద విలేకర్లకు వివరాలు వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు ప్రేమ పేరుతో మయమాటలు చెప్పి పట్టణానికి చెందిన నర్సింహస్వామి ఇతర ప్రాంతానికి తీసు కెళ్లాడు. ఆమె దగ్గర ఉన్న బంగారాన్ని కూడా జల్సాలకు వాడుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా బాలిక ఆచూకి దొరికిందన్నారు. వివరాలు సేకరించి బాలి కను కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. అప్పటి నుంచి నిందితుడు నర్సింహస్వామి కోసం గాలిస్తుండగా గురువారం పాలకొల్లు రోడ్‌లో ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఎస్సై వెంకట సురేష్ సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారన్నారు. సీఐ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసుల్లో జైలు శిక్ష, జరిమానా

నూజివీడు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నూజివీడుకు చెందిన గరికముక్కు ఆనందరావు శ్యామ్యూల్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పు వెలువరించారు. నూజివీడుకు చెందిన పుట్టింపాడు రంగారావు 2019 ఆగస్టులో రూ.4 లక్షలు నగదు శ్యామ్యూల్‌కు అప్పుగా ఇచ్చాడు. బాకీ చెల్లించమని రంగారావు అడుగగా శ్యామ్యూల్ రూ.2 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్ బౌన్స్ కావడంతో రంగారావు కోర్టును ఆశ్రయించాడు. న్యాయ మూర్తి ముద్దాయికి జరిమానా, జైలు శిక్ష విధించారు.

• గంపలగూడెంకు చెందిన మేడంకి మేరి కుమారికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.9 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. విజయవాడకు చెందిన దరిశి నాగదుర్గ 2019 ఆగస్టులో మేరి కుమారికి రూ.8 లక్షల నగదు అప్పుగా ఇచ్చారు. బకాయి కింది నాగదుర్గకు మేరి కుమారి రూ.8.5 లక్షలు చెక్కు ఇచ్చింది. చెక్కు బౌన్స్ కావడంతో మేరి కుమారికి జరిమానా, జైలు శిక్ష పడింది.

బలవంతపు విడాకులు

రెండు గ్రామాల పెద్దలపై కేసు

కైకలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామాల కట్టుబాట్లు మధ్య భార్యాభర్తలను విడదీసిన ఇరుగ్రామాల పెద్దలపై కైకలూరు రూరల్ ఎస్‌ఐ వి.రాంబాబు గురు వారం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. 2012లో మండలంలోని చటకాయ గ్రామానికి చెందిన ముంగర సుభాష్ చంద్రరాజుకు ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రుకు చెందిన రిషితతో వివాహమైంది. వీరి మధ్య విబేధాలు రావడంతో నాలుగేళ్లుగా శ్రీపర్రులో విడివిడిగా ఉంటున్నారు. ఇటీవల ఇరు గ్రామాల పెద్దలు వారు విడాకులు తీసుకునేలా ఒప్పంద పత్రాలు రాయించారు. అయితే విడాకులు తీసుకో వాలని తనపై ఒత్తిడి చేశారని బాధితురాలు కైకలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత సోమవారం ఏలూరులో జరిగిన గ్రీవెన్స్‌లోను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నెల రోజుల్లో చటాకాయ పెద్దలపై ఇది రెండో కేసు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

చింతలపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యర్రగుంటపల్లి గ్రామంలో చర్చి సమీపంలో గురువారం లారీ ఢీకొని గ్రామానికి చెందిన మానికల నాగమ్మ (65) తీవ్రంగా గాయపడింది. ఆమెను ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ కుటుంబరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



దెందులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరి ఊడ్పులకు వచ్చిన కూలీ ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. దెందులూరు గ్రామంలోని ఇంద్రవనం చెరువు వద్ద కాపలాగా ఉంటున్న మహారాష్ట్రకు చెంది పువత్తి బ్రహ్మానందం (29) ట్రాక్టర్ నడుపుతుండగా తిరగబడటంతో దాని కింద పడి మృతి చెందాడు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దెందులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శింగవరం పరిధిలోని ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పోలవరం మండలం గుటాలకు చెందిన కోరాడ సూర్యారావు(62) మృతి చెందాడు, దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

జేఎన్‌వీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 26 వరకు పొడిగించినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఇప్పటికే సమర్పించిన దరఖాస్తుల్లో ఏవైనా తప్పులుంటే సవరించుకునేందుకు ఈ నెల 27, 28 తేదీల్లో వెసులుబాటు కల్పించారని వివరించారు. జేఎన్‌వీ ప్రవేశపరీక్ష ఫిబ్రవరి 8న జరుగుతుందన్నారు. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా ఎంఈవోలు, స్కూల్ హెచ్‌ఎంలు ప్రోత్సహించాలని కోరారు.

రిటైర్మెంట్ ఖాళీల భర్తీకి విద్యా వలంటీర్లను నియమించాలి

ఏలూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉపాధ్యాయులను తరచూ పని సర్దుబాటు పేరుతో ఇతర పాఠశాలలకు పంపడం వల్ల టీచర్లు తీవ్ర మానసిక ఆందోళన, గందరగోళానికి గురవుతున్నారని ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు కృష్ణ, రత్నంబాబు, మోహన్ అన్నారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రిటైర్మెంట్ ఖాళీలు ఏర్పడితే నెలవారీ పదోన్నతులు లేదా అర్హత గల విద్యా వలంటీర్లతో భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ చర్యలతో హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత నివారించవచ్చన్నారు. నిధులు మంజూరై నెలరోజులు కావస్తున్నా ఇప్పటికీ పలు పాఠశాలలకు నిర్వహణ నిధులు జమ కాలేదని, వెంటనే స్కూలు ఖాతాలకు నిధులు జమ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

24న టీచర్లకు శిక్షణ తరగతులు

ఏలూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు సంబంధిత ఉపాధ్యాయులే కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మానవత ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ తరగతులను ఈ నెల 24న నిర్వహిస్తున్నట్టు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్టులు శిక్షణ ఇస్తారన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ ఉపాధ్యాయుల జిల్లా సదస్సు ఎంఏకెఏ ఉర్దూ మున్సిపల్ స్కూలులో గురువారం జరిగింది. ప్రతీ పాఠశాలలో ఉర్దూ ఎస్జీటీ, హైస్కూలులో స్కూల్ అసిస్టెంట్, జూనియర్/డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులను భర్తీచేయాలని సంఘ రాష్ట్ర అదనపు కార్యదర్శి సనావుల్లా షరీఫ్ డిమాండ్ చేశారు. సంఘ జిల్లాశాఖకు జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సయ్యద్ జిలానీ, సయ్యద్ మురసలీన్, కోశాధికారిగా సయ్యద్ సల్మాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ నాయకులు షేక్ ఇమ్రాన్, ఎస్కే.ఖలీల్, ఎస్కే.బాజీషహీద్, ఎండి.గౌస్‌పాషా, ఎస్కే హజరత్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

రజక సమస్యలపై డీపీవోకు వినతి

ఏలూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారుల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, తక్షణం పరిష్కరించాలని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య డీపీవో కొడాలి అనురాధను కోరారు. డీఎల్‌పీవో అధ్యక్షతన ఉన్న కమిటీలో చెరువులు లీజు నిర్ణయంలో తేడాల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని కట్లయ్య వివరించారు. వృత్తిచెరువులను సర్వే అధికారులతో సర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు. కొలమూరి రత్నరాజు, చిందాడ శ్రీనివాస్, కె.వెంకటేశ్, కె.శ్రీనివాస్, డేవిడ్, శంకరరావు, కె.సుబ్బయ్య, వంశి, కె.మురళి పాల్గొన్నారు.

● రజక కార్పొరేషన్ చైర్మన్ సి.సావిత్రిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చాటపర్తి పోసిబాబు తదితరులు కలిసి అభినందించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విషయంపై కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆమెను కలిసిన వారిలో జి.రాఘవేంద్ర, పి.వెంకట్రావు, బి.శ్రీనివాసరావు, ఏ.ఉమాశంకర్, బి.కోటేశ్వరరావు, మహేశ్ ఉన్నారు.

యడవల్లిలో వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహాల ప్రతిష్ఠ

కామవరపుకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు యడవల్లి విద్యానగర్ సమీపంలో నిర్మించిన ఆలయంలో గురువారం వరసిద్ధి వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త చలమాల రాంబాబు, కనకదుర్గ దంపతులు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

సాయి మందిరాల్లో పూజలు

ఏలూరు కార్పొరేషన్: నగరంలోని షిరిడీ సాయి మందిరాల వద్ద భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. పల్లకి సేవా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● కామవరపుకోట: స్థానిక షిరిడీ సాయి మందిరాల్లో గురువారం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. రామాలయం ప్రాంగణంలోని, తేలీల బజారులోని, కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాల్లో గల షిరిడీ సాయి మందిరాల్లో భక్తులు బాబా వారిని దర్శించుకున్నారు.

కైలాస నాథ విగ్రహావిష్కరణ

జంగారెడ్డిగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలాపురంలో బైనేరు ఒడ్డున కైలాసభూమి సమీపంలో కైలాసనాథ మహాదేవ విగ్రహావిష్కరణ గురువారం జరిగింది. సీనియర్ న్యాయవాది కనుపర్తి వెంకట సింహాద్రి, సుచిత్ర దంపతుల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అర్చకులు వేదాంతం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో చనుపర్తి లక్ష్మి నరసింహ ధనకుమార్ నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. విగ్రహం ఏర్పాటుకు సహకరించిన గ్రామసర్పంచ్ కనుపర్తి శ్రీనివాస్‌కు విగ్రహం తయారుచేసిన శిల్పి సూర్యశ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

అద్దె భవనాల్లో అగచాట్లు

● కొయ్యలగూడెంలో అసంపూర్తి సచివాలయ భవనాలు ● సిబ్బంది, ప్రజల పాట్లు



మహిళా భవనంలో పరింపూడి పంచాయతీ



అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

కొయ్యలగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల పంచాయతీ భవనాలు లేవు. మరికొన్ని చోట్ల సచివాలయ భవన నిర్మాణాలు పూర్తికాలేదు. కొయ్యలగూడెం (పరింపూడి) పంచాయతీ కార్యాలయం మహిళా సంఘ భవనంలో కొనసాగుతోంది. శిథిల భవనం ప్రమాదభరితంగా ఉందని ఉద్యోగులు, ప్రజలు వాపోతున్నా పంచాయతీ కార్యాలయం కొనసాగిస్తున్నారు. నూతన భవనం నిర్మాణం చేయడానికి ఆరేళ్ల క్రితం మహిళా సంఘ భవనంలోకి పంచాయతీ కార్యాలయాన్ని మార్చారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి అప్పటి టీడీపీ ప్రభుత్వంలోనే నిధులు కేటాయించారు. తర్వాత వైసీపీ పాలనలో పరింపూడి పంచాయతీని నాలుగు సచివాలయాలుగా విభజించి నాలుగు సచివాలయాలకు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు నిధులు కేటాయించారు. ఒక సచివాలయ భవన నిర్మాణం పంచాయతీ కార్యాలయ ఆవరణలోనే చేపట్టారు. 50 శాతం పనులతో అసంపూర్తిగా నిలిచిపోయింది. మరో సచివాలయ భవన నిర్మాణం కన్నాపురం రోడ్డులోని లేఅవుట్‌లో ప్రభుత్వానికి కేటాయించిన స్థలంలో చేపట్టారు. అది కూడా 50 శాతం పనులతో, మూడో సచివాలయం రేపల్లెవాడ వద్ద కూడా అసంపూర్తిగా ఉంది. ఉంది. నాలుగో సచివాలయం ఎంపీడీవో కార్యాలయం వెనుక 80 శాతం పనులు పూర్తి కాగా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఒక సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ ఉద్యోగులు మహిళా సంఘ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన మూడు సచివాలయ ఉద్యోగులు అద్దె భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు ప్రారంభమైనా కొయ్యలగూడెంలో ఒక సచివాలయం కూడా పూర్తికాకపోవడం గమనార్హం. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ భవనాలను పూర్తి చేయడంలో శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న మహిళా సంఘం భవనం కూడా పైకప్పు పెచ్చులూడి వర్షం కురుస్తోంది. అటువంటి భవనంలో పంచాయతీ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి ఈ నాలుగు సచివాలయాల పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్సీ ఎస్టీ చట్టాల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పోలవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడ మొడియం శ్రీనివాస్ అన్నారు. కన్నాపురం జంక్షన్ వద్ద సీఐడీ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ చట్టంపై ఒకరోజు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. రాజమహేంద్రవరం రీజనల్ సీఐడీ డీఎస్పీ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలపై నేరాలు, వారికి చట్ట రక్షణ అంశాలు వివరించారు. న్యాయవాది సొబ్బన ఆనందరావు మాట్లాడుతూ పౌర హక్కులు, అట్రాసిటీ యాక్ట్, ప్రత్యేక కోర్టు నిర్వహణపై అవగాహన కల్పించారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాలసురేష్‌బాబు, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, తహసీల్దారు సాయిరాజు, పవన్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులకు ఎస్సీ ఎస్టీ చట్టంపై ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. సీఐడి ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పలువురు వక్తలకు శాలువాలు కప్పి సన్మానం నిర్వహించారు.





పెదనింద్రకొలను విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వీరప్రసాద్, పోతునూరులో ర్యాలీ

బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

నిడమర్రు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఆత్మవిశ్వాసంతో స్వీయరక్షణ శిక్షణ పొందాలని ఎస్సై వీరప్రసాద్ అన్నారు. పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో 'అభయ' రక్షణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు గురించి తెలియజేశారు. హెచ్‌ఎం, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

భీమడోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పూళ్ళ జడ్పీ హైస్కూలులో చైల్డ్ డ్రస్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ విజయలక్ష్మి సహకారంతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ నూర్జహాన్ మాట్లాడుతూ మండల స్థాయిలో బాల్య వివాహాలను నిరోధించడానికి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుని సమాచారాన్ని అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు కల్యాణ మహేశ్వరి, భువనేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దత్తత చట్టంపై అవగాహన ర్యాలీ

దెందులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దత్తత తీసుకోవడం చట్ట ప్రకారం న్యాయమైన చర్య అని, చట్టం ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని ఫోస్టర్ కేర్ గృహ మేనేజర్ కె.భార్గవి అన్నారు. పోతునూరులో డీసీపీయూ, స్త్రీశిశు సంక్షేమ శాఖ సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో గురువారం దత్తత మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పోతునూరు పాతూరు, లక్ష్మీపురం, గాంధీ బొమ్మ సెంటర్లలో ర్యాలీ నిర్వహించారు. సునీత, రాజ్‌కుమార్, మాధవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్న ప్రసాద్ హనుమాన్ జంక్షన్ ఏపూరిలో దివ్యాంగుల పాఠశాలలను గురువారం సందర్శించారు. జిల్లాలోని దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య, మానసిక పరిస్థితులను పరిశీలించి, వైద్య సదుపాయాలు కల్పించడానికి చర్యలు చేపట్టామన్నారు. రెండు సంస్థలలో బాల బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు సరఫరా చేశారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ పి.పద్మావతి, ఏపీవో రాజశేఖర్, ఆశ్రం హాస్పిటల్ సీఈవో హనుమంతరావు, ఆశాజ్యోతి పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి లత, ఆదిత్య దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సబ్సిడీ బకాయి చెల్లించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పాం, కోకో తదితర మొక్కలు, దొండ పందిళ్లు, ఇతర ఉద్యాన పంటల సబ్సిడీ బకాయిలు రైతులకు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్‌రావుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. రైతులకు అధిక దిగుబడులు ఇచ్చే ఆయిల్‌పాం విత్తనాలను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఆయిల్‌పాం మొక్కల కొరత లేకుండా చూడాలన్నారు. ఉద్యాన పంటలకు తెల్ల దోమ వంటి తెగుళ్ళు ఆశించి రైతులు నష్టపోతున్నారని, వాటి నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని కోరారు. కట్టా భాస్కరరావు తదితరులు ఉన్నారు.

వెలమ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ఘంటా ప్రసాదరావు

ఏలూరుసిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని బీసీ సంక్షేమ భవనంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ పీవీజీ.కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనను ఏలూరు జిల్లా టీడీపీ నేత ఘంటా ప్రసాదరావు కలిసి అభినందించారు. అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయనతో పాటు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని కూడా ఘంటా ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

13 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా మహాసభలు డిసెంబరు 13, 14, 15 తేదీల్లో బుట్టాయిగూడెంలో నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డీఎన్‌వీడీ.ప్రసాద్, పి.కిశోర్, ఆర్.లింగరాజు తెలిపారు. పవరుపేట లోని సీపీఎం జిల్లా గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 13న ప్రారంభమయ్యే సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం పాల్గొంటారన్నారు. మూడేళ్లగా పార్టీ కార్యక్రమాలను, సాధించిన విజయాలను మహాసభల్లో వివరిస్తామని, భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 పథకాలు అమలు చేయాలన్నారు. పెన్షన్ విషయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకు ఇస్తామన్న వాగ్దానం నిలబెట్టుకోవాలన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లను అర్హులైన వారందరికీ అందించాలని, ఉచిత ఇసుక పేరుకు మాత్రమే కాకుండా ఆచరణలో చూపించాలన్నారు. మద్యం పాలసీ విధానంలో మార్పులు చేసి మద్యం నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకించిన కూటమి అధికారంలోకి వచ్చాక అదే విధానాన్ని కొనసాగించడం తగదన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను తొలగించాలని, ట్రూఅప్ విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఆగడంలేదని, ఇటీవల విశాఖలో వైద్య విద్యార్థినిపై జరిగిన సంఘటనే ఇందుకు సాక్ష్యమన్నారు. ప్రభుత్వం శాంతిభద్రలను కాపాడాలని, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామన్నారు. ఎన్నికల హామీ మేరకు సూపర్ - 6 పథకాల అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం : చింతమనేని

పెదవేగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గార్లమడుగు పంచాయతీ వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన బెల్లంకొండ ధర్మారావుకు చెందిన పాడి గేదె మృత్యువాత పడడంతో ఎమ్మెల్యే ప్రభాకర్ రూ.60వేలు నగదు సాయం అందించారు. ఐదేళ్ల అరాచకపాలనుంచి విముక్తి పొందిన ప్రజలు ఐదు నెలల్లోనే సంక్షేమం రుచిని ఆస్వాదించారన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం ముందడుగు వేస్తుందని ప్రభాకర్ చెప్పారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, పెన్మెత్స శివరామరాజు, జయబాబు, ముప్పాళ్ళ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



పాడిగేదె కొనుగోలుకు నగదు అందిస్తున్న చింతమనేని

సీఎం సహాయ నిధి నుంచి రూ.4.5 లక్షలు అందజేత

జీలుగుమిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం గ్రామానికి చెందిన కంబంపాటి సత్యవతి కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సాయం కోరారు. ఆయన స్పందించి సీఎం సహాయ నిధి ద్వారా సాయం అందజేయడానికి కృషి చేశారు. ఆమెకు శస్త్ర చికిత్స చేసేందుకు రూ.4.50లక్షల చెక్కు కుటుంబ సభ్యులకు అందజేశారు. సహాయం అందజేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బాలరాజుకు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.



రూ.4.5 లక్షల చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

అంగన్‌వాడీ కేంద్రాలు సేవలకు నిలయం కావాలి

పెదపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు సేవలకు నిలయంగా మారాలని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమర్థవంతంగా సేవలందించాలని మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పద్మావతి తెలిపారు. అప్పనవీడులోని అంగన్‌వాడీ కేంద్రాలను పద్మావతి గురువారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు, పోషకాహార నాణ్యతను తనిఖీ చేసి అక్కడి చిన్నారులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పెరటి తోట పెంపకంపై సూచనలు చేశారు. ఎంఎస్.రాజశేఖర్, సూపర్‌వైజర్ కుమారి, కార్యకర్తలు సుధ, కుమారి, రజని, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సేవలు తెలుసుకుంటున్న పద్మావతి

శీతాకాలం గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

లింగపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో గర్భిణులు, బాలింతలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ యానీప్రీతి సూచించారు. ధర్మాజీగూడెంలో గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శీతాకాలంలో గర్భిణులకు పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. తరచూ అలర్జీ, అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే డాక్టరును సంప్రదించాలన్నారు. సరైన పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకో వాలని తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు ప్రతిరోజూ గర్భిణులను గమనించాలన్నారు. డాక్టర్ ప్రియాంక, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.



బాలింతకు సూచనలు ఇస్తున్న డాక్టర్ యానిప్రీతి

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం : మేయర్

ఏలూరు టూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని నగర మేయర్ నూర్జహాన్ అన్నారు. విజయవాడ వరద సమయంలో బాధితులను ఆదుకునేందుకు ఏలూరు నుంచి వెళ్ళిన పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. 600మంది కార్మికులకు ఈఎస్సై హెల్త్ కార్డులు అందజేశారు. విజయవాడలో సేవలందించిన మహిళలకు చీరలు, మగవారికి రెండు జతల ఫ్యాంట్, షర్టులు అందజేశారు. పారిశుధ్య కార్మికులకు బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్.పెదబాబు, కర్రి శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, భాష, దేవరకొండ శ్రీనివాస్, నున్నా కిశోర్, పవన్, శ్యామ్యూల్, కొండేపల్లి రాజు, అదనపు కమిషనర్ చంద్రయ్య డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, సూపరింటెండెంట్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఆంధ్ర ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

మహిళ కడుపులో 10 కేజీల గడ్డ తొలగింపు



ఏలూరుటూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రా ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. 40 ఏళ్ల మహిళ కడుపులో 10 కేజీల గడ్డ తొలగించారు. మహిళ ఐదేళ్ల నుంచి తీవ్ర కడుపునొప్పి, రక్తహీనతతో బాధపడుతోంది. హైదరాబాద్‌లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. స్థానిక ఆంధ్రా ఆసుపత్రిలో పరీక్షలు చేసి కడుపులో గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ ద్వారా 10కేజీల గడ్డను తొలగించారు. డాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్, డాక్టర్ శర్వాణి ఆపరేషన్ నిర్వహించారు.

బెల్టుషాపులపై దాడులు

ఇద్దరిపై కేసు నమోదు

భీమడోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూళ్ళ, కురెళ్ళగూడెం, అంబర్‌పేట గ్రామాల్లో బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఉంగుటూరు మండలం యర్రమిల్లి, చేబ్రోలు, ఉంగుటూరు గ్రామాల్లో కూడా దాడులు నిర్వహించారు. ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని పూళ్ళ గ్రామానికి చెందిన ఒక మహిళపై కేసు నమోదు చేశారు. దాడుల్లో భోగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

చింతలపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంచెనగూడెం శివారు అటవీ ప్రాంతంలో సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. సాకా చంద్రరావు వద్ద 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. మేడూరి బన్ని పరారయ్యాడని సీఐ పి.అశోక్ తెలిపారు. శివపురంలో పాత కేసులో గుత్తా వెంకటేశ్వరరావును చింతలపూడి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు ఆర్‌వీఎల్.నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, ఎండి.ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

జంగారెడ్డిగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం సర్కిల్‌పరిధిలో ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు చేశారు. కుక్కునూరు మండలం శ్రీధర వేలేరు శివారు అటవీ ప్రాంతంలో 1800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో బెల్టుషాపులు నిర్వహిస్తున్న కుందెం నాగవీరభద్రరావు వద్ద 11మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో 200 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు వెంకటలక్ష్మి, ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహన యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

చింతలపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యండపల్లిలో రుద్రాక్షల పద్మ పూరిల్లు దగ్ధమైంది. అగ్నిమాపక అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. ఆస్తి నష్టం సుమారు రెండు లక్షలు ఉంటుందని, షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి కోటేశ్వరరావు తెలిపారు.

యువతి అదృశ్యం

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన ఒక యువతిని కుటుంబ సభ్యులు ఫోన్ మాట్లాడవద్దని అనడంతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. అశోక్ నగర్ చెందిన ఒక యువతి (19) ఒక మార్ట్‌లో పనిచేస్తోంది. ఇంటికి వచ్చిన తర్వాత తరచు ఫోన్లు మాట్లాడుతుంది. దీంతో కుటుంబ సభ్యులు మార్ట్‌లో పని మాన్పించారు. ఇంటి వద్ద ఫోన్లు మాట్లాడవద్దని చెప్పడంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హోటల్‌పై విజిలెన్స్ దాడి

6 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

ఉంగుటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరులోని ఒక హోటల్‌లో గృహావసర గ్యాస్ సిలిండర్ల వాడకంపై విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. అధికారులు గురువారం దాడి చేసి హోటల్‌లో 6 గృహావసర గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి, సీఎస్ డీటీ కొల్లూరి వెంకట స్వర్ణదుర్గ పాల్గొన్నారు. సిలిండర్లను స్వాధీనం చేసుకుని హోటల్ యజమాని దాసరి పాండురంగాపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి తెలిపారు.

విద్యార్థులకు కంప్యూటర్ కోర్సు సర్టిఫికెట్ల పంపిణీ

ఉంగుటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 45 రోజుల కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం నాడు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సెప్టెంబరు 1న ప్రారంభమైన ఈ కోర్సులో వంద మందికి పైగా విద్యార్థులు నమోదయ్యారు. వారికి కోర్సు పూర్తి కావడంతో ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ కొండా రవి, గుడి సోంబాబు సర్టిపికెట్లు పంపిణీ చేశారు. ఇంకా ఎవరైనా శిక్షణ పొందాలనుకుంటే పేర్లు నమోదు చేసుకోవాలన్నారుజ వివరాలకు 9441175498, 9866355120 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఐదుగురు

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణలు

వచ్చేనెల 5న పోలింగ్.. 9న కౌంటింగ్

కాకినాడ, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణలు గురువారం ముగిశాయి. ఒకే ఒక్క అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ చేసు కోగా ఎన్నికలబరిలో ఐదుగురు అభ్యర్థులు నిలి చారు. ఎన్నికల బరిలో నిలిచినవారిలో బుర్రా గోపి మూర్తి, గంథం నారాయణరావు, నామన వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్ ఉన్నారు. ఇకనుంచి వీరు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమవ్వనున్నారు. వచ్చేనెల 5న పోలింగ్ జరగనుంది. 9న కౌంటింగ్ జరగనుంది. దీనికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. మొత్తంగా 16,316మంది ఓటు హక్కు విని యోగించుకోనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2893మంది, ఏలూరు జిల్లాలో 2605 మంది, కాకినాడ 3333 మంది, కోనసీమ 3209 మంది, పశ్చిమ గోదావరి 3662 మంది ఓటర్లు ఉన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఉండగా, దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, కోనసీమ జిల్లాలో 22, పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

అంతా మా ఇష్టం..

ట్రాఫిక్ నిబంధనలు గాలికి..







సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం.. రెప్పపాటులో ప్రమాదం జరిగిపోతుంది.. ఇలా డ్రైవింగ్ చేయడం నేరం కూడా.. జరిమానా, జైలుశిక్ష కూడా ఉంటుంది.. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.. ట్రాఫిక్ నిబంధనలు తమకు కాదన్నట్టుగా వెళ్లిపోతున్నారు.. గురువారం భీమవరంలో పలు సెంటర్లలలో కనిపించిన దృశ్యాలివి..

- ఫొటోగ్రాఫర్, భీమవరం



గజ..గజ

పడిపోయిన రాత్రిపూట ఉష్ణోగ్రతలు

ఏలూరుసిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చలి గాలులు చంపేస్తున్నాయి. సాయంత్రం అయ్యేసరికి చలి తీవ్రత ఉగ్రరూపం దాలుస్తోంది. నాలుగు రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతున్నాయి. గురువారం ఏలూరు జిల్లాలో చలి తీవ్రత రాత్రి సమయంలో 17 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదు అవుతోందని ఇంటర్‌నెట్ సమాచారం ద్వారా తెలుస్తోంది. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో రాత్రి సమయాల్లో చలిని తట్టుకోవడం ప్రజలకు కష్టతరంగా తయారైంది. చలిని తట్టుకోలేక అనారోగ్యాల పాలవుతున్నారు. చలి తీవ్రత కారణంగా శ్వాసకోశ సంబంధ వ్యాధులతో పాటు జలుబు, జ్వరం భారిన పడుతున్నారు. పగటి పూట ఉష్ణోగ్రతలు 31 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదు అవుతున్నా రాత్రి పూట ఉష్ణోగ్రతలు మాత్రం కనిష్ట స్థాయికి పడిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి నవంబరు నెలలోనే కనిష్ట ఉష్ణోగ్రతలు తారస్థాయికి పడిపోయాయి. నవంబరు 18 వతేదీ నుంచి 21 వతేదీ వరకు పరిశీలిస్తే జిల్లాలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 19 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మరింత ఎక్కువగా చలిగాలులు వీస్తున్నాయని చెబుతన్నారు.రాత్రి సమయాల్లో జనం బయటకు రావటానికే భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏజెన్సీ మండలాలతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాలైన విలీన మండలాల్లోను, జంగారెడ్డి గూడెం పట్టణంలోను , కృష్ణా పరివాహక ప్రాంతాలలోను రాత్రి పూట చలి తీవ్రత విపరీతంగా పెరిగింది.

బయటకు రావడం లేదు

తెల్లవారుజామున, పగటి పూట కూడా చలి తీవ్రత ఎక్కువగా ఉండ టంతో రైతులు పంటపొలాలకు వెళలేకపోతున్నారు. కూలీలు కూడా చలిని తట్టుకోలేక పనులకు ఆలస్యంగా వెళ్లాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.రాత్రి సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు తగ్గాయి. రాత్రి సమయాల్లో రహదారులపై జనసంచారం అంతంత మాత్రంగానే ఉంటోంది. చలి తీవ్రతను తట్టుకోవటానికి ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. వారం రోజులుగా ఉన్ని దుస్తుల అమ్మకాలు కూడా పెరిగాయని వ్యాపా రస్తులు చెబుతున్నారు. ఏలూరు నగరంతో పాటు జిల్లా లోని మిగిలిన పట్టణాలు,పలు మండల కేంద్రాల్లో ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి.

జ్వరాల భయం

చలి తీవ్రత కారణంగా ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ముఖ్యంగా రొంప, జ్వరం దగ్గులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గొంతు సంబంధిత వ్యాధులు ఎక్కువగా సంక్ర మిస్తున్నాయని చెబుతున్నారు. చలిగాలుల కారణంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై బయటకు ప్రయాణాలు తగ్గించారు. గత నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతల వివరాలు ఇవీ..

తేదీ	గరిష్ట / కనిష్ట
నవంబరు 18	31/19
నవంబరు 19	31/19
నవంబరు 20	31/18
నవంబరు 21	31/17



వైభవంగా మావుళ్ళమ్మ జ్యోతియాత్ర

భీమవరంటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) మావుళ్ళమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి దీక్షల్లో భాగంగా గురువారం రాత్రి మాలధారులతో జ్యోతియాత్ర చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద మాలధారులతో ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 400 మంది మాలధారులు జ్యోతులను చేతపట్టుకుని మావుళ్ళమ్మ శరణ ఘోషతో, మంగళ వాయిద్యాలతో ప్రత్యేకంగా తయారుచేసిన వాహనంలో అమ్మవారి ఫొటో ఉంచి యాత్ర నిర్వహించారు. ఆలయం నుంచి బయలు దేరి ప్రధాన వీధుల మీదుగా చివరగా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. ఈవో బుద్దమహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు.



చాట్రాయి-పోలవరం మధ్య డేంజర్ టర్నింగ్

డేంజర్ టర్నింగ్

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-వెలగలపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి (వివి రోడ్డు)లో మండలంలో చాట్రాయి-పోలవరం గ్రామాల మధ్య బాలు చెరువు వద్ద ఉన్న రోడ్డు మలుపులో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం ఇక్కడ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. భారీ కంకరు లారీ బోల్తా పడి డ్రైవర్ గాయపడ్డాడు. ఏడాది క్రితం ఈ మలుపులో ప్రమాదం జరిగి చాట్రాయికి చెందిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సుమారు 15 ఏళ్ళ నుంచి ఇక్కడ 20 యాక్సిడెంట్లు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. రోడ్డు టర్నింగ్ ఇరుకుగా ఉండటం, ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవటం, వాహన చోదకుల అతి వేగం వలన ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానికులు ఇక్కడకు వచ్చే సరికి భయం భయంగా వాహనాలు నడుపుతూ ఉంటారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ ప్రమాదాలు జరక్కుండా హెచ్చరిక బోర్డులు, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

ముదినేపల్లి, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): కార్తీక మాసం సందర్భంగా అల్లూరులోని సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. మహిళలు శివలింగాకారం త్రిశూలం, అమ్మవారి ప్రతిరూపం ఆకారాలతో దీపారాధన చేశారు. ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు, అర్చకుడు ఐలూరి సుబ్బరాయశర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన తదితర పూజలు, అభిషేకాలను నిర్వహించారు. సర్పంచ్ శీలం రామకృష్ణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, గుల్లిపల్లి సుధారాణి, రెడ్డి రాధిక తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఆగిరిపల్లి, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): శోభనాచల వ్యాఘ్రలక్ష్మి నరసింహ స్వామి హుండీ ఆదాయం రూ.3,60,630 వచ్చినట్లు ఈవో సీహెచ్.సాయి తెలిపారు. గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ మొత్తం స్వామివారి బ్యాంకు ఖాతాలో జమ చేశారని తెలిపారు.

నిధుల కేటాయింపుపై క్రైస్తవుల హర్షం

ఆగిరిపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ భవన్‌కు రూ. 10 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం నూసేన్ దేవకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పాస్టర్ల గౌరవ వేతనం తదితర క్రైస్తవ పథకాలను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. పాస్టర్లకు క్రైస్తవ వివాహ లైసెన్స్ రెన్యువల్ పీరియడ్ మూడు సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు పెంచిన చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

కలిదిండి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అధికారులకు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. తహసీల్దార్ రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈఈ ఫణి మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ డిసెంబరు 5న విడుదలవుతుం దని, 8న మండలంలో 12 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. నీటి సంఘాలు ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలనే దానిపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ట్రైనర్ డి.వి.నాగేశ్వరరావు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆగిరిపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈదులవారిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'మాదకద్రవ్యాలు - ఆరోగ్యంపై ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపు హక్కులు ఉన్నాయని, బాలల హక్కులని అందించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాఠశాల హెచ్ఎం ప్రసాద్ ప్రసంగించారు. విజేతలు కీర్తి, ఎన్.కిక్, రమ్యశ్రీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేశారు.

విద్యార్థినులకు అవగాహన

కలిదిండి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికలు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కరుణ కుమారి అన్నారు. గురువారం బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే 112, 1098 నెంబర్లకు కాల్ చేయాలన్నారు. హెచ్ఎం ఎ.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇంటి పన్నులు వసూలు చేయాలి

కైకలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్నులను వేగవంతంగా వసూలు చేయాలని ఈవోపీఆర్డీ కొండలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు గురువారం సమావేశాన్ని నిర్వహించారు. నూతనంగా నిర్మాణం చేసిన భవనాలకు ఇంటి పన్ను విధించాలని, కొలతలు తీసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతీ గ్రామంలో పన్ను వసూళ్లను నిర్వహించాలని, గతంలో ఉన్న బకాయిలను వసూలు చేయాలన్నారు.

సీసీ రోడ్ల పనులు నాణ్యతగా ఉండాలి



ముసునూరు బీసీకాలనీలో సీసీరోడ్డును పరిశీలిస్తున్న పి.ఆర్ ఈఈ బాపిరెడ్డి

ముసునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన నూతన సీసీరోడ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈఈ తాడి పర్తి బాపిరెడ్డి అన్నారు. గురువారం ముసునూరు, కాట్రేనిపాడు, లోపూడి, అక్కిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో జరుగుతున్న సీసీరోడ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో అంతర్గత రహదారులను సీసీరోడ్లుగా అభివృద్ధి చేసేందుకు సుమా రు రూ.3కోట్ల50లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నియోజవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, వార్డు సభ్యులు నల్లి బోయిన రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో రూ.5లక్షల ప్రమాద బీమా



:గోపవరంలో టీడీపీ ఉచిత సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

ముసునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్క కార్యకర్తకు రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పించారని పార్టీ యువనేత ఉప్పల పాటి గణేష్ అన్నారు. గోపవరం గ్రామపంచా యతీ పరిధిలో ఉచిత టీడీపీ సభ్యత్వ క్యాంప్‌లను నిర్వహిస్తున్నారు. గురువారం ఎస్సీ, బీసీకాల నీల్లో గణేష్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు జరిగింది. గణేష్ ఆర్థిక సాయంతో సభ్యత్వ రుసుము రూ.100 చెల్లించి సభ్యత్వ నమోదును ఉచితంగా చేశారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి లాల్

బాలల చట్టాలపై అవగాహన అవసరం

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం రాత్రి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొట్టి లాల్ పిల్లల విద్యా హక్కు చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, పిల్లల హక్కులు రక్షణకు రూపొందించి పలు చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అత్తులూరి శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటరెడ్డి, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదానంతో ప్రాణ దాతలు కావాలి

నూజివీడు టౌన్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తం దానం చేసి ప్రాణ దాతలు కావాలని డాక్టర్ ఎంఆర్‌ఏఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన అన్నారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ 1, 2 యూనిట్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని ఆమెతో కలిసి నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సింగ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ బి.సురేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్వర్ బాషా, డాక్టర్ నాగరాజు, డాక్టర్ కీర్తి, డాక్టర్ విజయశ్రీ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ విష్ణు రక్తదానం

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రైవేటు హాస్పటల్‌లో 16 నెలల చిన్నారి గుండె ఆపరేషన్‌కు సింగిల్ డోనర్ ప్లేట్స్ కోసం ఏబీ రక్తదాత కోసం సోషల్ మీడియాలో ప్రకటన చూసిన చాట్రాయి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ విష్ణు హుటాహుటిన బెజవాడ వెళ్ళి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విష్ణుని ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది అభినందించారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు

ముదినేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వచ్చేనెల 6 నుంచి 19 వరకు షష్ఠి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు దేవస్థానం ఆవరణ, పరిసరాల్లో విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. దేవస్థానంలో పుట్ట వద్ద నాగ ప్రతిమల వద్ద భక్తుల రద్దీ నియంత్రించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల ప్రారంభం రోజున సుమారు 30 నుంచి 40 వేల మంది, మిగిలిన రోజుల్లో నిత్యం 20 వేల మంది భక్తులు వస్తారన్న అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు.



ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న స్వాగత ద్వారం

రాష్ట్రస్థాయి పోటీలకు అల్లూరు విద్యార్థిని ఎంపిక



ముదినేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గుడివాడలో జరిగిన జిల్లాస్థాయి అండర్- 14 ఖోఖో పోటీల్లో బాలికల విభాగంలో అల్లూరు జడ్పీ హైస్కూల్‌లో 6వ తరగతి విద్యార్థిని పంతగాని లిఖిత రాష్ట్రసాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23 నుంచి 25 వరకు పల్నాడు జిల్లా కారంపూడిలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటుందని హెచ్ఎం రామోజీరావు తెలిపారు. హెచ్ఎంతో పాటు ఎస్ఎంసీ ఛైర్మన్ శీలం వెంకట శ్యామల, ఉపాధ్యాయులు లిఖితను అభినందించారు.



తాగునీటి చెరువులో కలుషిత నీరు తొలగింపు

కలిదిండి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మట్టగుంటలో తాగునీటి చెరువులో కలుషిత నీరును పూర్తిగా తొలగించడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సర్పంచ్ అంద్రాజు రత్నమణి చర్యలు తీసుకున్నారు. ఈ నెల 19న 'ఆంధ్రజ్యోతి'లో 'తాగునీటి చెరువు కలుషితం' శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెరువులో కలుషిత నీరును పూర్తిగా తొలగించి చెరువు అడుగు భాగాన్ని ఎండగట్టారు. చెరువు బెడ్‌పై బ్లీచింగ్ క్లోరినేషన్ చేస్తున్నారు. శుక్రవారం నుంచి మట్టగుంట చెరువుకు తాగునీటి వంతు ఇస్తామని ఇరిగేషన్ ఏఈఈ ఫణి తెలిపారు.

బలవంతపు విడాకులు ఇప్పించిన..

గ్రామ పెద్దలపై కేసు నమోదు

కైకలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామాల కట్టుబాట్లు మధ్య భార్యాభర్తలను విడదీసిన ఇరుగ్రామాల పెద్దలపై కైకలూరు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు గురువారం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. 2012లో మండలంలోని చటకాయ గ్రామానికి చెందిన ముంగర సుభాష్ చంద్ర రాజుకు ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రుకు చెందిన రిషితతో వివాహమైంది. వీరి మధ్య విబేధాలు రావడంతో నాలుగేళ్లుగా శ్రీపర్రులో విడివిడిగా ఉంటున్నారు. ఇటీవల ఇరు గ్రామాల పెద్దలు వారు విడాకులు తీసుకునేలా ఒప్పంద పత్రాలు రాయించారు. విడాకులు తీసుకోవాలని తనపై ఒత్తిడి చేశారని బాధితురాలు కైకలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత సోమవారం ఏలూరులో జరిగిన గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా నెల రోజుల వ్యవధిలో చటాకాయ గ్రామ పెద్దలపై రెండో కేసు నమోదు కావడం గమనార్హం.




ఆస్పత్రిలో క్షతగాత్రులు

ట్రక్ ఆటోను ఢీకొన్న వ్యాన్

నలుగురికి తీవ్ర గాయాలు..

ఒకరి పరిస్థితి విషమం

కైకలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు-కోరుకొల్లు ఆర్‌అండ్‌బీ రహదారిలో బొలెరో వ్యాను ట్రక్ ఆటోను ఢీకొట్టిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం 4గంటల సమయంలో మండలంలోని శ్యామలాంబపురానికి చెందిన మత్స్యకారులు కైకలూరులో చేపల పట్టుబడికి ట్రక్ ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యలో ఆచవరం చల్లాలమ్మ ఆలయం సమీపంలో కాకినాడ నుంచి రొయ్యపిల్ల సీడ్‌తో మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం వెళ్తున్న బొలెరో వ్యాన్ ముందు వెళుతున్న ఆటోను ఢీకొంది. ఆటో రహదారిపై పల్టీలు కొట్టగా బొలెరో వ్యాన్ పక్కనే డ్రెయిన్‌లో తిరగబడింది. ఆటోలో ప్రయాణిస్తున్న టి.నాగలక్ష్మి, ఎం.శ్రీరాములు, నరసింహస్వామి, బి.అప్పయ్య తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు వ్యక్తుల బైండోవర్

నూజివీడు టౌన్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): బెల్టు షాపులు, సారా విక్రయం, తయారీకి పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుటు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై ఎ.మస్తానయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం, సారాపై 9949539933 నెంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

చెల్లని చెక్కు కేసుల్లో జైలు శిక్ష, జరిమానా

నూజివీడు టౌన్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): చెల్లని చెక్కు కేసులో నూజివీడుకు చెందిన గరికముక్కు ఆనందరావు శ్యామ్యూల్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పు వెలువరించారు. నూజివీడుకు చెందిన పుట్టింపాడు రంగారావు 2019 ఆగస్టులో రూ.4 లక్షలు నగదు శ్యామ్యూల్‌కు అప్పుగా ఇచ్చాడు. బాకీ చెల్లించమని రంగారావు అడుగగా శ్యామ్యూల్ రూ.2 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్ బౌన్స్ కావడంతో రంగారావు కోర్టును ఆశ్రయించాడు. విచారించిన న్యాయమూర్తి ముద్దాయికి జరిమానా, జైలు శిక్ష విధించారు.

● గంపలగూడెంకు చెందిన మేడంకి మేరి కుమారికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.9 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. విజయవాడకు చెందిన దరిశి నాగదుర్గ 2019 ఆగస్టులో మేరి కుమారికి రూ.8 లక్షల నగదు అప్పు ఇచ్చారు. బకాయి కింది నాగదుర్గకు మేరి కుమారి రూ.8.5 లక్షలు చెక్కు ఇచ్చింది. చెక్కు బౌన్స్ కావడంతో మేరి కుమారికి జరిమానా, జైలు శిక్ష పడింది.

బెల్లపు ఊట ధ్వంసం

ఆగిరిపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగన్నగూడెంలో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు. బెల్ట్‌షాపులు, సారా తయారు చేసి అమ్మేవారి వివరాలను 9949539933 అనే నంబరుకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

ఆగిరిపల్లి సీపీఎం కన్వీనర్‌గా శివనాగరాజు

ఆగిరిపల్లి, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): ఆగిరిపల్లి మండలం సీపీఎం నూతన కన్వీనర్‌గా చాకిరి శివనాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా ముత్యాల నరేష్, ఈపూరి రవీంద్ర, నయనవరపు ఉలక్కయ్య, జంగం శౌరి, శుభాకర్‌ను ఎన్నుకున్నారు.